సాక్షి
సూర్యాపేట
బుధవారం ၊ 11 ၊ అక్టోబర్ ၊ 2023



ముమ్మరంగా పోలీసుల తనిఖీలు
ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. - 10లో



సైబర్ నేరగాళ్ల టోకరా
రూ.500 నోటుపై 786 నంబర్ ఉంటే లక్ష రూపాయలు ఇస్తామంటూ సైబర్ నేరగాళ్లు కుచ్చుటోపి పెట్టారు. - 10లో



బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలి
బీఆర్ఎస్ ఓట్లతో బుద్ధి చెప్పాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

13న యోగాసన పోటీలు

మునగాల(కోదాడ): నల్లగొండ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 13న ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం డి.అజంబాబా ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ -14,17,19 బాలబాలికలకు యోగాసన పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన బాలబాలికలకు ఈనెల చివరి వారంలో సిద్దిపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాల్సి ఉంటుందని సూచించారు. వివరాలకు అండర్- 14,17బాలబాలికలు సెల్ నంబర్ 98489 85833లో, అండర్ -19బాలబాలికలు సెల్‌నంబర్ 96401 40183లో సంప్రదించాలని కోరారు.

నర్సరీల్లో మొక్కలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

పెన్‌పహాడ్: గ్రామాల్లోని నర్సరీల్లో విరివిగా మొక్కలు పెంచాలని అదనపు కలెక్టర్ ప్రియాంక అన్నారు. మంగళవారం పెన్‌పహాడ్ మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో మట్టితోలి బ్యాగుల్లో నింపాలన్నారు. ప్రజలకు అవసరమైన మొక్కలను అందజేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ నాయకుల పేర్లను, పోస్టర్లను తొలగించాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ సుందరి కిరణ్‌కుమార్, మండల ప్రత్యేక అధికారి రాంపతి, ఫారెస్ట్ ఏఎస్‌ఐ, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఎంపీఓ నరేష్, ఏపీఓ రవి, ఈసీ ఏకస్వామి తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసరెడ్డి



హుజూర్‌నగర్ : హుజూర్ నగర్ మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన ఎస్. వెంకటేశ్వర్లు నేరేడుచర్ల మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లారు. నేరేడుచర్ల కమిషనర్‌గా పనిచేసిన శ్రీనివాసరెడ్డి హుజూర్ నగర్‌కు వచ్చారు.

12,13 తేదీల్లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన

సూర్యాపేట క్రైం: తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక బోర్డు వెలువరించిన ఫలితాల్లో కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థులకు జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఈ నెల 12, 13తేదీల్లో పూర్వపరాలు, యథార్థ ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సివిల్, ఆర్మ్‌డ్ విభాగాలకు ఎంపికైన 318మంది, బెటాలియన్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఫైర్, ఎక్సైజ్, మెకానిక్, ఐటీ విభాగాల్లో ఎంపికైన మరో 202మందికి ఈ పరిశీలన ఉంటుందన్నారు. అభ్యర్థులు వారి వ్యక్తిగత ఐడీలో చూపిన విధంగా సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో జిల్లా పోలీస్ కార్యాలయానికి రావాలని సూచించారు. సివిల్, ఆర్మ్‌డ్ కానిస్టేబుల్ అభ్యర్థులు 12న, మిగిలిన విభాగాల్లోని అభ్యర్థులు 13వ తేదీన కార్యాలయానికి రావాలని కోరారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: ప్రసిద్ధి గాంచిన మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, శ్రీమూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, అష్టోత్తర సమస్రనామార్చనలు చేశారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం చేపట్టారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ , మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతును ముగించారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేకార్చనలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అనువంశిక చైర్మన్ చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్.. కేటీఆర్



హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ చిత్రంలో మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు తదితరులు

- అసంతృప్తులను బుజ్జగించే పనుల్లో జగదీష్‌రెడ్డి, కేటీఆర్
- పార్టీకి దూరంగా ఉంటున్న వారిని చేరదీసేలా వ్యూహం
- కేటీఆర్‌తో నేతి విద్యాసాగర్, పలువురు నాయకుల భేటీ
- స్వయంగా వెంటబెట్టుకెళ్లిన జిల్లా మంత్రి
- చేరికలపైనా గులాబీ నాయకత్వం ప్రత్యేక దృష్టి



కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జిల్లేపల్లి వెంకటేశ్వర్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలో 'ఆపరేషన్ కేటీఆర్' మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల్లో 12 స్థానాలను కైవసం చేసుకోవాలన్న లక్ష్యంతో బీఆర్ఎస్ పావులు కదుపుతోంది. అసంతృప్తులు, ఆశావహులు ఒక్కొక్కరిని బుజ్జగించేందుకు నడుం బిగించింది. జిల్లా మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి నేతృత్వంలో కేటీఆర్ వద్ద అసంతృప్తులు, ఆశావహులతో భేటీలు మొదలయ్యాయి. జగదీష్‌రెడ్డి మాట్లాడటంతోపాటు వారిని కేటీఆర్ వద్దకు తీసుకెళ్లి ఒప్పించేలా, వారికి స్పష్టమైన అవగాహన వచ్చేలా వ్యూహం అమలు చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి చేరికలను ప్రోత్సహించి బలాన్ని పెంచుకునే దిశగా బీఆర్ఎస్ అడుగులు వేస్తోంది.

కేటీఆర్‌తో చకిలం భేటీ

నల్లగొండ నియోజకవర్గం నుంచి తనను ఎమ్మెల్సీ చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినా, ఆచరణకు నోచుకోకపోవడంతో అలకబూని బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన చకిలం అనిల్ కుమార్‌ను నాయకులు బుజ్జగిస్తున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు మేరకు చకిలం అనిల్ కుమార్, మంత్రి జగదీష్ రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కేటీఆర్‌తో మంగళవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. తమతో కలిసి పనిచేయాలని ఆయన్ని కోరారు. గతంలోనే హామీలు ఇచ్చిన నేపథ్యంలో ఇప్పుడు ప్రత్యేకంగా హామీలు ఇవ్వబోనని, బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాబోతోందని, కచ్చితంగా గౌరవప్రదమైన స్థానం కల్పిస్తామని కేటీఆర్ ఆయనతో చెప్పినట్లు తెలిసింది. తద్వారా నియోజకవర్గంలో బ్రాహ్మణ సామాజికవర్గంతోపాటు ఆయన అనుచరులు కలిసి వచ్చేలా రంగం సిద్ధం చేశారు. త్వరలోనే చకిలం తన నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది.

పార్టీలోనే ఉన్నా దూరంగా..

నకిరేకల్ నియోజకవర్గానికి చెందిన శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ ఇన్నాళ్లుగా పార్టీలోనే ఉన్నా కొంత అంటీముట్టనట్లుగా ఉన్నారు. తనకు ఎమ్మెల్సీ ఇస్తారని ఆశించినా ఇవ్వకపోవడంతో నిరాశతోనే ఉన్నారు. పార్టీ వ్యవహారాలకు కూడా దూరంగా ఉంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన్ని దగ్గరకు తీసేలా బీఆర్ఎస్ చర్యలు చేపట్టింది. మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందినవారు కావడంతో ప్రస్తుతం నియోజకవర్గంలో ఆ సామాజికవర్గం ఓట్లను పూర్తిస్థాయిలో రాబట్టుకునే వ్యూహంతో బీఆర్ఎస్ వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగానే మంగళవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌తో మంత్రి జగదీష్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య భేటీ అయ్యారు. పార్టీ వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొనేలా నేతి విద్యాసాగర్‌ను ఒప్పించారు.

మిగతా నియోజకవర్గాలపైనా దృష్టి

ఉమ్మడి జిల్లాలోని మిగతా నియోజకవర్గాల్లోనూ అసంతృప్త నేతలు, ఆశావహులపై అధిష్ఠానం దృష్టి సారించింది. వారితోనూ త్వరలోనే సమావేశమై బుజ్జగించే కార్యాచరణను అమలు చేయాలని నిర్ణయించింది. దేవరకొండ, నాగార్జునసాగర్, కోదాడ తదితర నియోజవర్గాల్లోని అసంతృప్తులతో మంత్రి జగదీష్‌రెడ్డి చర్చలు జరుపుతున్నారు. త్వరలో వారిని కూడా కేటీఆర్ భేటీకి ఆహ్వానించనున్నారు. మంగళవారం కేటీఆర్‌తో భేటీకంటే ముందుగానే హైదరాబాద్‌కు వెళ్లిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలంతా మంత్రి జగదీష్‌రెడ్డి నివాసంలో కలిసి.. అసంతృప్తుల బుజ్జగింపునకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు.

కేటీఆర్ సమక్షంలో చేరికలు

కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి చేరికలపైనా బీఆర్ఎస్ దృష్టి సారించింది. ఆలేరు నియోజకవర్గానికి చెందిన టీపీసీసీ మాజీ సభ్యుడు, ఎన్ఎస్‌యూఐ మాజీ జిల్లా అధ్యక్షుడు చామల ఉదయ్‌చందర్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రితోపాటు స్థానిక ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చామల ఉదయ్‌చందర్ రెడ్డికి మంత్రి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఉదయ్ చందర్‌రెడ్డికి బీఆర్ఎస్‌లో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు మరికొంత మంది బీఆర్ఎస్‌లో చేరారు. వైఎస్సార్‌టీపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మేళ్లచెర్వుకు చెందిన మాజీ డీసీఎంఎస్ చైర్మన్ జిల్లేపల్లి వెంకటేశ్వర్లు (జేవీఆర్) బీఆర్ఎస్‌లో చేరారు. జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ప్రోద్బలంతో కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా వేసుకున్నారు. దేవరకొండ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేతావత్ బీల్యానాయక్ కూడా కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు ప్రకటించారు. బుధవారం కేటీఆర్ సమక్షంలో చేరబోతున్నట్లు వెల్లడించారు.

ఎనిమిది నియోజకవర్గాల్లో కేసీఆర్ సభలు

- ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించనున్న గులాబీ బాస్



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కె.చంద్రశేఖర్‌రావు సుడిగాలి పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ నెల 31వ తేదీ నాటికే ఎనిమిది బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు సీఎం కేసీఆర్ పర్యటన షెడ్యూల్‌ను బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. నాలుగు రోజుల్లో ఎనిమిది నియోజకవర్గాల్లో నిర్వహించే సభల్లో సీఎం పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ నెల 16న మధ్యాహ్నం భువనగిరి సభలో పాల్గొననున్నారు. 26వ తేదీన సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు మునుగోడు సభలో పాల్గొంటారు. 29వ తేదీన మధ్యాహ్నం నుంచి సాయంత్రం మూడు నియోజకవర్గాల సభల్లో పాల్గొననున్నారు. కోదాడలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు, తుంగతుర్తిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు, ఆలేరులో 3 గంటల నుంచి 4 గంటల వరకు జరిగే సభల్లో పాల్గొంటారు. అదేవిధంగా 31వ తేదీన మూడు నియోజకవర్గాల్లో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పర్యటిస్తారు. హుజూర్‌నగర్‌లో ఒంటిగంట నుంచి 2 గంటల వరకు , మిర్యాలగూడలో 2 గంటల నుంచి 3 గంటల వరకు, దేవరకొండలో 3 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహించే బహిరంగ సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొంటారు. ఈ సభల నిర్వహణ కోసం ఎమ్మెల్యేలు ఏర్పాట్లు చేస్తున్నారు.

భావ సారూప్య పార్టీలతో పొత్తు



మిర్యాలగూడలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం, చిత్రంలో జూలకంటి రంగారెడ్డి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

మిర్యాలగూడ, నిడమనూరు : మతోన్మాద పార్టీ అయిన బీజేపీని నిలువరించడానికి భావసారూప్యత గల పార్టీలతో పొత్తు పెట్టుకుంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆయన మంగళవారం మిర్యాలగూడ, నిడమనూరులో పార్టీ కార్యకర్తల సమావేశంలో, ఆ తరువాత విలేకరులతో ట్లాడారు. మతతత్వ పార్టీ అయిన బీజేపీని రాష్ట్రంలో, దేశంలో విస్తరించకుండా చేయడమే సీపీఎం లక్ష్యమన్నారు. బీజేపీ దాని అనుబంధ సంఘాలకు వ్యతిరేకంగా పనిచేసే వారికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. మోదీ పతనం ప్రారంభమైందని, ఇండియా కూటమి అంటేనే మోదీకి భయం పట్టుకుందని, అందుకే ఇండియా పేరును భారత్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మహిళాబిల్లు తీసుకురావడం హర్షణీయమే అయినా.. దాని అమలుకు కాలయాపన సరికాదన్నారు. బీజేపీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా 2024 ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో జనగణనతో పాటు కుల గణన జరగాల్సి ఉన్నదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తున్నారని, దానిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కేసీఆర్‌ను ఇండియా కూటమిలో రావాలని ఆహ్వానించినా రాలేదని, భవిష్యత్తులో బీజేపీకి దగ్గరయ్యేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అందుకే తాము బీఆర్ఎస్ పార్టీతో తెగదెంపులు చేసుకున్నామని తెలిపారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా తాము కీలకంగా వ్యవహరిస్తామని కేటీఆర్ చెప్పడం వెనుక అర్థంఅదేనని అన్నారు. తెలంగాణలో తమ పార్టీ నిర్ణయించుకున్న స్థానాల్లో పోటీస్తామని తమ్మినేని చెప్పారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మిర్యాలగూడలో ఎర్రజెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలోపోతినేని సుదర్శన్, ఖమ్మం , నల్లగొండ జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వర్ రావు, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్, రేపల్లి వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు, చిత్రంలో ఎస్పీ రాజేంద్రప్రసాద్, అదనపు కలెక్టర్

- కలెక్టర్ వెంకట్రావు
- పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సమావేశం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని రాజకీయ పార్టీలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 3న గెజిట్ నోటిఫికేషన్ ఉంటుందని తెలిపారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 1,201 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, నూతనంగా 33 పోలింగ్ కేంద్రాలు ఏర్పడ్డాయన్నారు. ఈ ఎన్నికల్లో 40 శాతం అంగ వైకల్యం ఉన్న వికలాంగులకు, 80 సంవత్సరాలు దాటిన వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభానికి ఐదు రోజుల ముందే ఎన్నికల అధికారులకు ఫామ్ 12 డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 7, 200 మంది సిబ్బందిని ఎన్నికల విధులు నిర్వహించేందుకు సిద్ధం చేశామన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ రాంజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని చెక్ పోస్టుల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, రాజకీయ పార్టీల గుర్తులతో వస్తువులు దొరికితే సీజ్ చేస్తామని, అత్యవసర సమయంలో నగదు తీసుకొని వెళ్లేటప్పుడు ఆధార ధ్రువపత్రాలను కమిటీకి చూపించాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా అంతటా గట్టి నిఘా ఉంచామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎ. వెంకట్‌రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు చకిలం రాజేశ్వర్ రావు, నవరాల సత్యనారాయణ, ఆబిద్, కోట గోపి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

'చెక్ యువర్ ఓటు' కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన చెక్ యువర్ ఓటు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు మంగళవారం జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి , వివిధ రాజకీయ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెక్ యువర్ ఓటు కేంద్రంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ ఓటును పరిశీలించుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్. వెంకట్రావు మాట్లాడుతూ అన్ని తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల్లో చెక్ యువర్ ఓటు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ చెక్ యువర్ ఓటు కేంద్రంలో తమ ఓటు చెక్ చేసుకోవాలని, ఓటు హక్కు లేనివారు సంబంధిత అధికారులకు సమాచారం అందజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు



బి.చందుపట్లలో వననర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

చివ్వెంల(సూర్యాపేట) : గ్రామాల్లో హరిత హారంలో భాగంగా నిర్వహిస్తున్న వన నర్సరీల విషయంలో నిర్లక్ష్య వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ వెంకట్రావు హెచ్చరించారు. మంగళవారం చివ్వెంల మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, వన సేవకులకు నర్సరీలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై అవగాహన కల్పించారు. అనంతరం మండల పరిధిలోని బి.చందుపట్ల గ్రామంలోని వన నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నర్సరీల నిర్వహణకు 10 శాతం గ్రీన్ బడ్జెట్ వినియోగించుకోవచ్చన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు తమ గ్రామాల్లో పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లోకి వచ్చే మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారులకు కార్యదర్శులు సహకరించాలన్నారు. ఆయన వెంట మండల స్పెషల్ అధికారి జి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రంగారావు, ఎంపీడీఓ ఎల్. లక్ష్మి, ఏపీఓ నాగయ్య, ఈసీ జ్యోతి పాల్గొన్నారు.

నచ్చిన కళాశాలకు మారొచ్చు!

- ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అవకాశం
- 15వ తేదీ వరకు చివరి గడువు
- ఉత్తర్వులు జారీ చేసిన ఇంటర్ బోర్డు అధికారులు



హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

హుజూర్‌నగర్ : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలకు మారేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. సమీప ప్రాంతాల్లో చదవాలనుకునే వారికి, తమ నిర్ణయాన్ని మార్చుకున్న వారికి ప్రభుత్వం ఈ వెసులు బాటు కల్పించింది. ప్రైవేట్ నుంచి ప్రభుత్వ కళాశాలకు, ప్రభుత్వ కళాశాల నుంచి ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందడానికి అవకాశం కల్పించారు. ఈ నెల 15 వరకు చివరి తేదీగా గడువు విధించారు.

జిల్లాలో మొత్తం 16,223 విద్యార్థులు

జిల్లాలో జూనియర్ కాలేజీలు మొత్తం 39 ఉన్నాయి. వాటిలో ప్రభుత్వ కళాశాలలు 7 ఉండగా ప్రైవేట్ కళాశాలలు 32 ఉన్నాయి. వీటిల్లో 12,723 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ కళాలల్లో 3,118, ప్రైవేట్ కళాశాలల్లో 9,605 మంది విద్యార్థులు ఉన్నారు. అంతే కాకుండా కేజీబీవీలు, ఇతర గురుకుల కాలేజీల్లో దాదాపు 3,500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారు నచ్చిన కళాశాలకు మారేందుకు యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. గ్రామాల నుంచి మండలాలకు, మండలాల నుంచి జిల్లాలోని పట్టణాలకు, జిల్లా కేంద్రానికి అనేక మంది విద్యార్థులు బస్సులు, ఆటోలతో పాటు ఇతర వాహనాలలో వస్తున్నారు. వీరికి తమకు సమీప ప్రాంతాల్లో చదువుకోవాలనే ఆలోచన ఉంటుంది. అలాంటి వారికి తాజా నిర్ణయంతో కొంత ఉపశమనం కలగనుంది.

యాజమాన్యాలు అంగీకరిస్తాయా?

ఇప్పటికే ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న వారు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరడానికి యాజమాన్యాలు అంగీకరిస్తాయా అనేది అర్థం కాని ప్రశ్నగా మారింది.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ కళాశాల్లో నాణ్యమైన విద్య అందించేందుకు యంత్రాంగం కృషి చేస్తోంది. నిపుణులైన అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారు. తాజాగా కళాశాలలు మార్చు కునేందుకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. కాలేజీ మారాలనుకునే విద్యార్థులు ఈనెల 15వ తేదీ లోగా స్పందించాలి. సంబంధిత కాలేజీల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలి.

– జానపాటి కృష్ణయ్య, డీఐఈఓ, సూర్యాపేట

చివరి భూములకు నీరందించాలి



కాలువను పరిశీలిస్తున్న సీఈ రమేష్‌బాబు

హుజూర్‌నగర్ : కాలువ చివరిభూములకు నీరందించాలని ఇరిగేషన్ సీఈ రమేష్ బాబు ఆదేశించారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌లో వస్తున్న నీటి పరిమాణాన్ని, నీటి నియంత్రణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి భూములకు నీరందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఇరిగేషన్‌శాఖ ఎస్ఈ నరసింహారావు, ఈఈలు శ్రీనివాస్, సత్యనారాయణ, డీఈలు భిక్షం, స్వప్న, ఏఈ తుమ్మల శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ రాజేంద్ర ప్రసాద్



దురాజ్‌పల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకుంటున్న ఎస్పీ

చివ్వెంల(సూర్యాపేట) : చెక్‌పోస్టుల వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ సూచించారు. మంగళవారం రాత్రి చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామంలో విజయవాడ-హైదరాబాద్ రహదారిపై చేపట్టిన వాహన తనిఖీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సూర్యాపేట నుంచి కోదాడ వైపు వెళ్తున్న కారులో రూ.2.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా డబ్బు, మద్యం, నిషేధిత వస్తువులు తరలిస్తే అడ్డుకోవాలన్నారు. అన్ని వాహనాలను తనిఖీ చేయాలని కోరారు. ఎలాంటి ధ్రువీకకణ పత్రాలు లేని వాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్లు చెప్పారు. నగదు, విలువైన ఆభరణాలు తీసుకెళ్తే సంబంధిత ఆధారాలు సమర్పించాలని సూచించారు. అంతకు ముందు చివ్వెంల పోలీసులు తనిఖీల్లో రూ.3.75 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగభూషణం, సీఐ రాజేష్, ఎస్ఐ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

త్వరగా విధివిధానాలు రూపొందించాలి

సూర్యాపేట : ఈహెచ్ఎస్ విధివిధానాలను త్వరగా రూపొందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్‌రెడ్డి, రాష్ట్ర సెక్రటరీ జనరల్ పి.చంద్రశేఖర్ కోరారు. ఈమేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఈహెచ్ఎస్ ద్వారా నగదు రహిత వైద్య సదుపాయం అమలుకు ఉత్తర్వులు విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

- ఆధారాలు చూపని నగదు సీజ్



కొండమల్లేపల్లి: ఆర్టీసీ బస్సులో తనిఖీలు చేపడుతున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

చౌటుప్పల్: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. చౌటుప్పల్ మండలం పంతంగి శివారులోని జీఎమ్మార్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. సోమవారం రాత్రి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా అందులోని వ్యక్తి వద్ద రూ.లక్ష నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రూ.50వేలకు మించి నగదు వెంట తీసుకెళ్తే సరైన పత్రాలు చూపించాల్సి ఉంటుందని, లేదంటే ఆ నగదును సీజ్ చేస్తామని సీఐ దేవేందర్ తెలిపారు.

కొండమల్లేపల్లిలో రూ.1.50లక్షల నగదు సీజ్..

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలో మంగళవారం చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.1.50లక్షల నగదును సీజ్ చేసినట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఓ ప్రైవేట్ వాహనంలో తీసుకెళ్తున్న రూ.లక్షతో పాటు మరో వ్యక్తి వద్ద రూ.50వేల నగదును సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆత్మకూర్(ఎస్)లో 1.85లక్షల నగదు..

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారులో రూ.1.85లక్షల నగదును ఎన్నికల తనిఖీ అధికారి నరేందర్ స్వాధీనం చేసుకున్నారు. హుజూర్‌నగర్‌కు చెందిన కొప్పుల సైదులు అనే కార్ల వ్యాపారి మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు నుంచి నెమ్మికల్ మీదుగా హుజూర్‌నగర్ వెళ్తూ రూ.1.85 లక్షలను తీసుకెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నగదుకు సంబంధించి అతడి వద్ద ఎలాంటి రశీదులు లేకపోవడంతో ఎస్ఐ వెంకట్‌రెడ్డి పట్టుబడిన నగదును జిల్లా కలెక్టర్‌కు అందించినట్లు అధికారులు తెలిపారు.

రూ.3.50 లక్షలు స్వాధీనం..

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని హనుమాన్‌పేటకు చెందిన శ్రీనివాస రంగారావు మంగళవారం ఒక సంచిలో రూ.3.50లక్షల నగదుతో మిర్యాలగూడ పట్టణంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం రోడ్డు నుంచి వెళ్తున్నాడు. అతడి వద్ద ఉన్న డబ్బుకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో అదే సమయంలో అక్కడ తనిఖీలు చేస్తున్న పోలీసులు డబ్బును సీజ్ చేసి ఆర్డీఓకు సరెండర్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ పి. రాఘవేందర్ తెలిపారు.

15.50లక్షలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

మేళ్లచెరువు: మండల కేంద్రం శివారులో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో హోండా యాక్టీవాలో తరలిస్తున్న రూ.15.50 లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్ఐ సురేష్‌యాదవ్ తెలిపారు. హేమ్లాతండా గ్రామ పంచాయతీకి చెందిన ముచ్చా శాగూర్ భూమి పంచాయితీ వ్యవహారంలో హుజూర్‌నగర్ కోర్టులో డబ్బులు కట్టాల్సి ఉండగా కోర్టు వారు పంచాయితీని వాయిదా వేసిన నేపథ్యంలో తిరిగి ఇంటికి తీసుకెళ్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. పట్టుబడిన నగదును మేళ్లచెరువు ఎంసీసీ టీంకి అప్పగించినట్లు తెలిపారు.

రూ.2లక్షలు స్వాధీనం..

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలో తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద పోలీసులు మంగళవారం వాహనాలను తనిఖీలు చేపట్టగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన బందీల కోటేశ్వర్‌రావు కారులో రూ.2లక్షలతో రంగారెడ్డి జిల్లాకు వెళ్తుండగా ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ఆ నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నగదును ఆర్డీఓ కార్యాలయంలో డిపాజిట్ చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

రూ. 1,36,500 సీజ్

కట్టంగూర్: ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.1,36,500 నగదును కట్టంగూర్ పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. కట్టంగూర్ మండల కేంద్రంలోని నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద హైవేపై వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు విజయవాడ నుంచి హైదరాబాదు వైపు కారులో గుంటూరు జిల్లా దుర్గి గ్రామానికి చెందిన పూతర్లంక ధనుంజనేయులు ఎలాంటి రశీదులు లేకుండా తీసుకెళ్తున్న రూ.60 వేలను సీజ్ చేశారు. అదేవిధంగా విజయవాడ నుంచి నల్లగొండ వైపు వెళుతున్న కారును తనిఖీ చేయగా కోదాడకు చెందిన మునగాల రామచంద్రారావు వద్ద ఉన్న రూ.76,500 నగదును సీజ్ చేసి డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేసినట్లు ఎస్ఐ డి. రాజు తెలిపారు.

హాలియాలో రూ. 30లక్షలకు పైగా..

హాలియా: మున్సిపాలిటీ పరిధిలోని అనుముల ఎక్స్ రోడ్డు (పాత ఐటీఐ) వద్ద మంగళవారం హాలియా పోలీసులు ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న రూ.30,99,500 నగదును పట్టుకున్నట్లు ఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు. గుంటూరు జిల్లాకు చెందిన వై. సత్యనారాయణ రూ.30లక్షలు తీసుకొని గల ఆర్టీసీ బస్సులో మిర్యాలగూడ నుంచి కొండమల్లేపల్లికి వెళ్తున్నాడు. ఆ డబ్బులకు సరైన ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా నారాయణపేట జిల్లాలోని ఊట్కూర్ మండలం పులిమామిడి గ్రామానికి చెందిన కె. శ్రీకాంత్ మిర్యాలగూడ నుంచి దేవరకొండకు ఆర్టీసీ బస్సులో రూ. 99,500 తీసుకొని వెళ్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మొత్తం రూ.30,99,500 సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.



జంటగా శాసనసభకు..



ఆరుట్ల కమలాదేవి



ఆరుట్ల రామచంద్రారెడ్డి



పద్మావతి



ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాడిన యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకకు చెందిన ఆరుట్ల దంపతులు రెండు సార్లు రాష్ట్ర శాసన సభకు ప్రాతినిధ్యం వహించారు. ఆరుట్ల కమలాదేవి మూడు సార్లు, ఆరుట్ల రామచంద్రారెడ్డి రెండుసార్లు ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. ఆరుట్ల కమలాదేవి 1952లో ఆలేరు అసెంబ్లీ స్థానం నుంచి పీడీఎఫ్ తరఫున పోటీ చేసి నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1957, 1962లో సీపీఐ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి 1967 వరకు ఆ పదవిలో కొనసాగారు. అదేవిధంగా ఆమె భర్త ఆరుట్ల రామచంద్రారెడ్డి మెదక్ జిల్లా రామాయంపేటకు 1953లో జరిగి ఉప ఎన్నికలో సీపీఐ నుంచి తొలిసారిగా విజయం సాధించారు. ఆయన 1962లో భువనగిరి నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 1953, 1962లో రెండు శాసన సభల్లో ఆరుట్ల కమలాదేవి, రామచంద్రారెడ్డి జంటగా అసెంబ్లీకి వెళ్లి ప్రజలకు సేవలందించారు.

ఉత్తమ్ దంపతులు కూడా..

2014లో హుజూర్‌నగర్ నుంచి కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ నియోజకవర్గం నుంచి ఆయన సతీమణి పద్మావతి గెలుపొందారు. ఇద్దరు జంటగా శాసనసభలో అడుగుపెట్టారు. ఉత్తమ్ అంతకు ముందు కూడా ఎమ్మెల్యేగా గెలుపొందగా.. పద్మావతికి ఆ ఎన్నికల్లో తొలి గెలుపు.

అక్రమంగా మద్యం రాకుండా నిఘా పెంచాలి



వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనిత

కోదాడరూరల్: మండలంలోని రామాపురం క్రాస్‌రోడ్ వద్ద ఏర్పాటు చేసిన రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును మంగళవారం సూర్యాపేట జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనిత తనిఖీ చేసి మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అక్రమంగా మద్యం, గంజాయి, బెల్లం, పటిక వంటి నిషేధిత పదార్థాలు తెలంగాణలోకి రాకుండా నిఘా పెంచాలని అన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట కోదాడ ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ప్రజా ఆశీర్వాద సభాస్థలి పరిశీలన



ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భువనగిరి: భువనగిరి పట్టణంలో ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హాజరుకానున్న ప్రజా ఆశీర్వాద సభకు మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని స్థానిక ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మైదానంలో వేదిక ఏర్పాటుతో పాటు ఇతర పనుల గురించి స్థానిక నాయకులు, అధికారులతో చర్చించారు. మైదానాన్ని చదును చేసే పనులను బుధవారం నుంచి ప్రారంభించాలని స్థానిక నాయకులు, అధికారులకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, బీఆర్ఎస్ పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

'తుంగతుర్తి' బీఎల్ఎఫ్ అభ్యర్థిగా వీరపాపయ్య



వీరపాపయ్య

అర్వపల్లి: తుంగతుర్తి నియోజకవర్గ బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ఎమ్మెల్యే అభ్యర్థిగా అర్వపల్లికి చెందిన ఈదురు వీరపాపయ్య ను బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ ప్రకటించారు. వీరపాపయ్య ప్రస్తుతం ఎంసీపీఐ(యూ) డివిజన్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు.

అనుచిత పోస్టులు పెట్టొద్దు

కోదాడ: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెట్టవద్దని కోదాడ డీఎస్పీ ప్రకాశ్ కోరారు. మంగళవారం కోదాడ ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే పోస్టులను ఆయా గ్రూపుల అడ్మిన్‌లు వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో అడ్మిన్‌ను బాధ్యుడిని చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలపై ఏమైనా ఫిర్యాదులుంటే సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.

ప్రజల చేతుల్లో బ్రహ్మాస్త్రం 'సీ-విజిల్'

- ఎన్నికల్లో ప్రలోభాలు, అక్రమాలను అరికట్టేందుకు ఉపయోగపడనున్న యాప్
- ఫొటో లేదా వీడియో అప్‌లోడ్ చేస్తే 100 నిమిషాల్లో చర్యలు



దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఎన్నికల్లో అభ్యర్థులు ఎలాంటి అక్రమాలకు పాల్పడినా ప్రజలు ఫిర్యాదు చేసేందుకు సీ-విజిల్ యాప్‌ను ఎన్నికల సంఘం ప్రవేశపెట్టింది. కేంద్ర ఎన్నికల సంఘం 2019లో రూపొందించిన సీ-విజిల్ యాప్ ద్వారా అభ్యర్థులు చేసే అక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను స్మార్ట్ ఫోన్‌లో తీసి అప్‌లోడ్ చేస్తే అవి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు వెళ్తాయి. ఇలా వచ్చిన ఫొటోలు, వీడియోలను వెంటనే పరిశీలించి వాస్తవాలుంటే వంద నిమిషాల్లోపు సంబంధిత అభ్యర్థిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఫొటోలు, వీడియోలు పంపిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతారు. ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ కలిగిన వ్యక్తులు గూగుల్ ప్లేస్టోర్ ద్వారా, ఐఫోన్ యూజర్లు ఐఓఎస్ ద్వారా సీ-విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్‌లో ఫిర్యాదు చేయడానికి వినియోగదారుడు స్మార్ట్‌ఫోన్ కెమెరా జీపీఎస్‌కి యాక్సెస్ కలిగి ఉండాలి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన రాష్ట్రంలోని ప్రజలు ఈ యాప్‌ను ఉపయోగించుకోవచ్చు. ఎన్నికల కమిషన్ ప్రకారం, ఎన్నికల తేదీలను ప్రకటించినప్పటి నుంచి ఓటింగ్ ముగిసే వరకు ఎవరైనా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. అభ్యర్థులు ప్రలోభాలకు గురిచేసినా, వివాదాస్పద ప్రకటనలు చేసినా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

ఫిర్యాదు చేయడం ఎలా?

సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలనుకునే వారు యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసిన తర్వాత అందులో రిజిస్టర్ కావాలి. దీని కోసం ఫిర్యాదుదారుడు తన పేరు, చిరునామా, రాష్ట్రం, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గం, పిన్‌కోడ్ వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇది ఓటీపీ సహాయంతో ధ్రువీకరించబడుతుంది. అనంతరం ఫొటో లేదా కెమెరాను ఎంచుకొని ఫొటో లేదా వీడియో తీసి అప్‌లోడ్ చేయవచ్చు. ఫిర్యాదుదారుడు యాప్‌లో గరిష్టంగా 2 నిమిషాల వీడియోను అప్‌లోడ్ చేయవచ్చు. ఫొటోలు, వీడియోలకు సంబంధించిన వివరాలను కూడా టైప్ చేయవచ్చు. ఎలక్షన్ కమిషన్ ప్రకారం అప్‌లోడ్ చేసే టో లేదా వీడియో ఆ స్థలం ఎక్కడుందో కూడా తెలుస్తుంది. ఫొటో లేదా వీడియో అప్‌లోడ్ చేసిన తర్వాత ప్రత్యేకమైన ఐడీ వస్తుంది. దీని ద్వారా వారు మొబైల్‌లోనే ఫాలోఅప్‌ని ట్రాక్ చేయవచ్చు. ఫిర్యాదుదారుడి గుర్తింపును గోప్యంగా ఉంచుతారు. అయితే ముందుగా రికార్డు చేసిన వీడియోలు లేదా ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయలేరు. సీ-విజిల్ యాప్ నుంచి రికార్డు చేసిన వీడియోలు లేదా ఫొటోలు ఫోన్ గ్యాలరీలో సేవ్ చేయలేరు.

ప్రలోభాలను అరికట్టేందుకు ఉపయోగం

ఎన్నికల్లో అవినీతి, అక్రమాలు, ప్రలోభాలను నియంత్రించేందు సీ-విజిల్ యాప్ ఎంతో ఉపయోగపడుతుంది. ప్రజలు ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ప్రజా పోలీసింగ్ వ్యవస్థగా మారాలి. యాప్‌లో అందే ఫిర్యాదులు గోప్యంగా ఉంచబడతాయి.

– ఎస్. వెంకట్రావు, జిల్లా ఎన్నికల అధికారి(కలెక్టర్), సూర్యాపేట

బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలి

- ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

భానుపురి (సూర్యాపేట): దళితబంధు పథకాన్ని బీఆర్ఎస్ పథకంగా మార్చిన ఆ పార్టీకి ఓట్లతో బుద్ధి చెప్పాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు పడిదెల రవికుమార్ అధ్యక్షతన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం అర్హులైన లబ్ధిదారులకు అందకుండా టీఆర్ఎస్ పార్టీ నాయకులు, వారికి అనుకూలమైన వ్యక్తులకే ఇస్తున్నారని ఆరోపించారు. దళిత బంధులో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన అక్రమాలపై సీఎం కేసీఆర్ విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిగలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ మరికంటి అంబేద్కర్, రాష్ట్ర కార్యదర్శి అల్లేటి లక్ష్మణ్, నాయకులు కనుకు జానయ్య, దుబ్బ రమేష్, పాల్వాయి సురయ్య, బచ్చలకూరి నాగరాజు, కడప పెంటయ్య, పిడమర్తి వెంకటనారాయణ, శ్రీను, నాగేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.

50కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు



పట్టుబడిన నిందితులు, గంజాయిని చూపుతున్న పోలీసులు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని రాష్ట్ర సరిహద్దు పోలీస్ చెక్‌పోస్టు వద్ద మంగళవారం ఉదయం రూ.12.50లక్షల విలువ గల 50కిలోల గంజాయిని విజయపురిటౌన్ పోలీసులు పట్టుకున్నారు. సాగర్ సీఐ బీసన్న, విజయపురిటౌన్ ఎస్ఐ సంపత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని లాథూర్ జిల్లా వారంతి గ్రామానికి చెందిన చౌదరి ఉమాకాంత్, ఆయన సతీమణి చౌదరి రుక్మిణి, పాతన్ అర్బాజ్‌ఖాన్ షేర్‌ఖాన్ మంగళవారం ఉదయం ఆరు గంటల సమయంలో కాలినడకన బ్యాగులతో నాగార్జునసాగర్‌లోని రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు సమీపంలో నుంచి నడిచి వెళ్తుండగా పోలీసులు వారిని ప్రశ్నించారు. దీంతో వారు పారిపోవడానికి ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా అందులో గంజాయి ప్యాకెట్లు లభించాయి. మొత్తం 36 ప్యాకెట్లలోని 50కిలోల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా.. ఈ నెల 7వ తేదీన గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలులో పశ్చిమగోదావరి జిల్లా ఎలమంచలికి వెళ్లి, అక్కడ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి ఆర్టీసీ బస్సులో మాచర్లకు వచ్చినట్లు పేర్కొన్నారు. మాచర్ల నుంచి వేరే వాహనంలో సరిహద్దు చెక్‌పోస్టు వద్దకు వచ్చి అక్కడి నుంచి నాగార్జునసాగర్‌లోని పైలాన్‌కాలనీకి నడిచి వెళ్లి బస్సులో హైదరాబాద్‌కు వెళ్లేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. దీంతో ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు సీఐ, ఎస్ఐ పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న ఎస్ఐలు సంపత్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, పోలీసు సిబ్బంది జావీద్, రామకోటి, ప్రభు, నర్సింహ, మజీద్, సత్యవతి, సీఐ బీసన్నను నల్లగొండ ఎస్పీ అపూర్వరావు, మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ దుర్మరణం



మధు (ఫైల్)

హాలియా: బైక్ వెళ్తున్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్పీఎఫ్) కానిస్టేబుల్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన అనుముల మండలంలోని పులిమామిడి స్టేజీ సమీపంలో నల్లగొండ–హాలియా రహదారిపై సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని సుదర్శనపురం గ్రామానికి చెందిన బుసిపాక మధు(30) కొంతకాలంగా నాగార్జునసాగర్ డ్యాం వద్ద ఎస్పీఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల తన చెల్లెలు పెళ్లి పనుల కోసం నాలుగు రోజులు సెలవు పెట్టి మధు తన స్వగ్రామానికి వెళ్లాడు. తిరిగి విధుల్లో చేరేందుకు సోమవారం బైక్‌పై మధు నాగార్జునసాగర్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో అనుముల మండలంలోని పులిమామిడి స్టేజీ వద్దకు రాగానే బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మధు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న హాలియా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడి భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు.

వ్యవసాయ బావిలో పడి బీటెక్ విద్యార్థి మృతి

మఠంపల్లి: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి బీటెక్ విద్యార్థి మృతిచెందాడు. ఈ ఘటన మఠంపల్లి మండలంలోని భీల్యానాయక్‌తండాలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. భీల్యానాయక్‌తండాకు చెందిన దారావత్ కోటేశ్వరరావునాయక్ ఏకైక కుమారుడు దారావత్ సునీల్(20) హైదరాబాద్‌లో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. మంగళవారం సునీల్ తమ వ్యవసాయ బావి వద్దకు పొలానికి విద్యుత్ మోటారు సహాయంతో నీరు పెట్టేందుకు వెళ్లాడు. విద్యుత్ మోటారుకు ఉన్న ఫుట్‌బాల్ నుంచి నీరు రాకపోవడంతో బావిలోకి దిగి ఫుట్‌బాల్‌ను సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. సునీల్‌కు ఈత రాకపోవడంతో ఊపిరాడక బావిలోనే మృతిచెందాడు. కొద్దిసేపటి తర్వాత స్థానిక గిరిజనులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమివ్వడంతో వారు వెళ్లి బావిలో నుంచి సునీల్ మృతదేహాన్ని బయటకు తీసి ఇంటికి తరలించారు. ఒక్కగానొక్క కొడుకు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

బేకరీ ఉత్పత్తులపై శిక్షణ



చిరుధాన్యాలతో చేసిన బేకరీ ఉత్పత్తులను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త లవకుమార్

గరిడేపల్లి: మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నారమ్), హైదరాబాద్ సహకారంతో షెడ్యూల్డ్ కులాల యువతులకు మంగళవారం చిరుధాన్యాలతో బేకరి ఉత్పత్తుల తయారీ విధానంపై కేవీకే శాస్త్రవేత్త సుగంధి అవగాహన కల్పించారు. అనంతరం కేక్, బిస్కెట్స్, దిల్ పసంద్ తయారు చేసి చూపించారు. కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జి ప్రోగ్రాం కోర్డినేటర్ బి. లవకుమార్, బేకరి నిపుణుడు సీహెచ్. నాగభూషణం, కేవీకే శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల టోకరా

- 786 నంబర్ గల రూ.500 కరెన్సీ నోటు ఉంటే లక్ష రూపాయలు ఇస్తామంటూ మోసం
- ట్యాక్స్‌ల పేరుతో రూ.38,820 చెల్లించిన బాధితుడు
- ఇంకా డబ్బులు పంపాలని కోరడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు



చిట్యాల: అజీజ్‌కు ట్యాక్స్ డబ్బులు రూ.25,120 కట్టాలంటూ వచ్చిన మెసేజ్

చిట్యాల: ఐదు వందల రూపాయల కరెన్సీ నోటుపై 786 నంబర్ ఉంటే లక్ష రూపాయలు ఇస్తామంటూ సైబర్ నేరగాళ్లు కుచ్చుటోపీ పెట్టారు. ఈ ఘటన చిట్యాల పట్టణంలో వెలుగులోకి వచ్చింది. వివరాలు.. చిట్యాల పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన అజీజ్ వెల్డింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అజీజ్ ఈ నెల 7వ తేదీన యూట్యూబ్ చూస్తుండగా ఓ వీడియోలో ×ఇండియన్ ఓల్డ్ కాయిన్ సేల్ కంపెనీ× పేరుతో ఉన్న లింక్‌లో 786 నంబర్ ఉన్న ఐదు వందల రూపాయల కరెన్సీ నోటు ఇస్తే లక్ష రూపాయలు ఇస్తామంటూ ఓ సెల్ నంబర్ కనిపించింది. దీంతో అజీజ్ తన వద్ద 786 నంబర్‌తో రెండు ఐదు వందల రూపాయల నోట్లు ఉన్నాయంటూ యూట్యూబ్ లింక్‌లోని నంబర్‌కు మెసేజ్ చేశాడు. 786 నంబర్ గల రెండు ఐదు వందల రూపాయల నోట్లకు గాను జీఎస్టీ, ఇతర ట్యాక్స్‌లు చెల్లించాల్సి ఉంటుందని సైబర్ నేరగాళ్లు తెలిపారు. ఈ మేరకు 8వ తేదీ రెండు విడతలుగా రూ.13,700, 9వ తేదీన రూ.25,120 మొత్తంగా రూ.38,820 ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. అనంతరం తన దగ్గర ఉన్న 786 నంబర్ గల ఐదు వందల రూపాయలను నోట్లు ఎలా పంపించాలని, తనకు రావల్సిన రెండు లక్షల రూపాయలు ఎప్పుడు ఎలా ఇస్తారంటూ తాను డబ్బులు పంపిన నంబర్‌కు అజీజ్ వాట్సాప్ కాల్ చేయగా మరికొన్ని డబ్బులు పంపాలంటూ సైబర్ నేరగాళ్లు చెప్పారు. ఈ విషయాన్ని గుర్తించిన అజీజ్ కుటుంబ సభ్యులు మోసపోయినట్లు గుర్తించి మంగళవారం చిట్యాల పోలీసులను ఆశ్రయించారు. కాగా అజీజ్ వద్ద డబ్బులు లేకున్నప్పటికీ ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలో బంగారం తనఖా పెట్టి డబ్బులు తెచ్చినట్లు అతడి కుటుంబ సభ్యులు తెలిపారు.

నకిలీ మరణ ధ్రువీకరణ పత్రంతో పట్టా భూమి మార్పిడి

- పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు

కట్టంగూర్: నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించి అక్రమంగా భూమి పట్టా మార్పిడి చేసుకున్న వ్యక్తితో పాటు అతడికి సహకరించిన వారిపై మంగళవారం కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలంలోని గార్లబాయిగూడెం గ్రామానికి చెందిన సిరిశాల మల్లమ్మకు సర్వే నంబర్ 199ఈ1/1, 199ఉ1/2లలో 14 గుంటల పట్టా భూమి ఉంది. అదే గ్రామానికి చెందిన సిరిశాల ఆంజనేయులు 2008 సెప్టెంబర్ 15న మల్లమ్మ చనిపోయినట్లు నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించి ఆమె పేరు మీద ఉన్న భూమి పట్టాను 2022 జూలై 15న తన పేరు మీదకు మార్చుకున్నాడు. ఇటీవల రైతు బంధు డబ్బులు తక్కువగా పడటంతో మల్లమ్మ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అడగగా ఆమెకు ఈ విషయం తెలిసింది. తన భూమిని పట్టా చేసుకొన్న వ్యక్తిపై, రెవెన్యూ అధికారులు, సాక్షిగా ఉన్న వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి. రాజు తెలిపారు.

వేర్వేరు చోట్ల చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

రామగిరి(నల్లగొండ): కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలంలోని ఇండ్లూరు గ్రామానికి చెందిన ఇడుకుళ్ల రవి(42) కుటుంబంతో కలిసి తిప్పర్తి మండల కేంద్రంలో ఉంటూ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ నెల 5వ తేదీన కుటుంబ సభ్యులతో రవికి గొడవ జరగడంతో అదే రోజు మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి భిక్షమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నల్లగొండ పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రవి మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఒంటిపై కిరోసిన్ పోసుకొని..

వలిగొండ: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్న వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలంలోని పులిగిళ్ల గ్రామానికి చెందిన సిలివేరు గణేష్(34) గాలి పంపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో పాటు అతడి భార్య కొంత కాలం క్రితం పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురై ఈ నెల 6వ తేదీన ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.